నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం "స్పందన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డా.జె అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం ఉదయం 10.30 నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగు తుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 - 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572-232745, వాట్సప్ నంబర్ 98499 07885లకు ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

ఓ వైపు యాప్‌లు.. మరోవైపు...

'వాట్సాప్'లో ప్రశ్నపత్రాలు

- 'అయ్వోర్ల'పై ఎందుకింత 'కక్ష'
- విద్యార్థులకూ తప్పని తిప్పలు
- 'ఫార్మేటివ్ బి2' పరీక్షల తీరు

ప్రజాశక్తి - పుంగనూరు

'వాట్సాప్‌లో గంట ముందు ప్రశ్నపత్రాన్ని విద్యాశాఖ పంపిస్తుంది.. దీన్ని ఉన్నది ఉన్నట్లుగా ఉపాధ్యాయులు బ్లాక్ బోర్డుపై రాయాలి.. దీన్ని చూసి విద్యార్థులు పరీక్ష రాయాలి... ఇది ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపో... లోటు బడ్జెట్టో... గానీ విద్యార్థుల వ్యథ వర్ణనాతీతం.. ఇచ్చిన గడువు లోపు పరీక్ష రాయాల్సి ఉంటుంది.. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో అయితే ఇదే అదునుగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వసూలు చేశారు.. ప్రింటెడ్ ప్రశ్నపత్రాలు పంపించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి.. 'ఫార్మేటివ్ బి2' పరీక్షల తీరు ఉపాధ్యాయులపై మరింత ఒత్తిడి పెంచుతుందని వారు వాపోతున్నారు.



పాఠశాలల్లో విద్యార్థులకు 'ఫార్మేటివ్ బి2' పరీక్షలు ప్రారంభమయ్యాయి. గతంలో ప్రశ్నాపత్రాలను ప్రభుత్వం ముద్రించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు అందించేది. అయితే కారణాలు తెలియవు గానీ వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపుతామని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యలు ఎదురవుతున్నాయి. వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్ డౌన్‌లోడ్‌చేసుకుని బ్లాక్ బోర్డుపై రాయాల్సి ఉంటుంది. దీనిని విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాలి. క్వశ్చన్‌పేపర్ రాసుకుని సమాధానాలు రాయడానికి సమయం సరిపోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రం ఓపెన్ చేయాలంటే నెట్ అవసరం ఉంటుంది. నెట్ పనిచేస్తే సమయం ప్రకారం నిర్వహించవచ్చు.

విద్యార్థులు బ్లాక్ బోర్డ్ నుండి ప్రశ్నలు రాసుకోవడానికి ఇంటిలిజెంట్, యావరేజ్ ,బిలో యావరేజ్ విద్యార్థులు ఉంటారు. ఇలాంటి సమయంలో పరీక్ష సమయంలో సమాధానాలు రాయలేక విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రైవేట్ విద్యాసంస్థల నుండి ఏడాది పరీక్షలు నిర్వహణకై ఒక విద్యార్థి నుండి 200 రూపాయలు ఇప్పటికే చెల్లించి ఉన్నారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఖజానా నింపుకున్నా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. బోర్డుపై రాసి పరీక్షలు నిర్వహించేందుకు ఒక గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయులకు విద్యాశాఖ పంపుతుంది. దీనిని ఉపాధ్యాయులు బోర్డుపై రాయాల్సి ఉండడంతో సమయం అంతా దానికి సరిపోతుంది. పరీక్ష రాసే సమయం 45 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఈలోపు ఉపాధ్యాయులు వీటిని బోర్డుపై రాసి మరల విద్యార్థులు వారి పేపర్లో రాయాలంటే సాధ్యపడే అవకాశం కాదు. పేపర్ మొత్తాన్ని బోర్డుపై రాసినందుకు కనీసం ఒకటిన్నర గంట పడుతుంది. హై స్కూల్ విద్యార్థులకు సైన్సులో బొమ్మలు, సోషల్ మ్యాపులు, లెక్కల్లోనూ ఫార్ములాలు ఉంటాయి .వీటిని కూడా బోర్డుపై రాయడానికి చాలా సమయం పడుతుంది. విద్యార్థులు పరీక్షకు ఇచ్చిన సమయం 45 నిమిషాలు మాత్రమే. వారు పేపర్ రాసుకునేందుకు ఈ సమయం సరిపోతుంది. జవాబులు రాయడానికి మానసికంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది . మరోవైపు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. ఈ సమస్య ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువగా ఉంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అన్ని తరగతులకు ప్రశ్నాపత్రాలు ఒకే ఉపాధ్యాయులు రాయడం సాధ్యం కాదని, ఇలాంటి పరిస్థితుల్లో ఇబ్బందులు తప్పవు. దీంతోపాటు ప్రభుత్వం యాప్‌ల వల్ల పని ఒత్తిడి మరోవైపు. అంతేకాకుండా నాడు నేడు పనులు, కోడిగుడ్ల సైజులు చూసుకోవడం, బియ్యం లెక్కలు, మరుగుదొడ్ల నిర్వహణ ఇలా ఎన్నో పనులను అప్పగించి వీటి కోసం 32 రకాల యాప్‌లు. వాటిలో 16 యాపులతో ప్రతిరోజు ఉపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వర్ల నెట్వర్క్ సమస్యల వల్ల యాప్ లో సమాచారం నమోదు చేయని వారికి కూడా విద్యాశాఖ నోటీసులు జారీ చేస్తుంది. వీటన్నింటినీ చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యకు పాల్పడుతుందా అనే సందేహం కలగక మానదు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రాన్ని పంపించే పద్ధతికి స్వస్తి పలికి ప్రింటెడ్ ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు అందజేయాలని మేధావులు కోరుతున్నారు.

64 సర్క్యులర్ రద్దయ్యేవరకు పోరాడాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వివోఏలను ఇంటికి పంపించే సర్కులర్ 64 రద్దయ్యే వరకు పోరాటం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరులోని ఓ పాఠశాలల్లో జరిగిన వివోఏల రెండవ మహాసభలు రాజశేఖర్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కాల రాయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పథకాల్లో సేవలందిస్తున్న వివోఏలపై రాజకీయ వేధింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కోటి మందికి మహిళలకు సేవలు అందిస్తున్న వారిపై నిర్లక్ష్య ధోరణి నిర్వహించడం దుర్మార్గం గత

వివోఏల జిల్లా మహాసభలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గంగరాజు

ప్రభుత్వం ఇదే వైఖరి వ్యవహరించడంతో ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించిన పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా పోరాడాలని ఉక్కు పాదంతో అణిచివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విఓఎల్ సమస్యలు పరిష్కారం చేయాలని కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివోఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరంజ్యోతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చైతన్యలు మాట్లాడుతూ కార్మికుల పోరాటా లను అణచివేస్తుందని వెనక తగ్గకపోతే కార్మికుల ఆగ్రహాన్ని గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మిక పోరాటాలను అణిచివేసిన ప్రభుత్వాలు ఏవి మనకు సాధించలేదని వివోఏలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ మహాసభలకు వివోఏల జిల్లా సంఘం కార్యదర్శి నాగరాజు నివేదిక సమర్పించగా చర్చలు జరిపి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాసభల్లో సిఐటియు జిల్లా నాయకులు కే.సురేంద్ర, ఆ సంఘం జిల్లా నాయకులు వసంత చంద్రబాబు, శేషాద్రి పాల్గొన్నారు.

జిల్లా మహాసభల్లో పాల్గొన్న వివోఏలు

నత్తనడకన ప్రభుత్వ భవన నిర్మాణాలు

- కాంట్రాక్టర్లకు అందని బిల్లులు
- ఎప్పటికి పూర్తయ్యేనో...!

ప్రజాశక్తి -యాదమరి

మండలంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు అందకపోవడంతో ప్రభుత్వ భవన నిర్మాణ పనులు నత్త నడకంగా సాగు తున్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో యాదమరి మండలంలో 26 గ్రామ పంచాయతీల పరిధిలో నూతనంగా 18 సచివాలయాలు భవనాలు మంజూరు చేశారు. వాటికి ఒక భవనానికి 25 లక్షల నుంచి 40 లక్షలు వరకు అంచనా వ్యయం. మండలంలో 18 భవనాలు మంజూరైతే 13 పూర్తయ్యాయి. ఇంకా ఐదు భవనాలకు పనులు చేపట్లేదు. రైతులకు ఉపయోగకరంగా రైతు భరోసా కేంద్రాలు 17 మంజూరయ్యాయి. ఈ భవనాలకు అంచనా వ్యయం రూ.21 లక్షలు అయితే మండలంలో 17 భవనాలు మంజూరైతే 9 భవనాలు పూర్తయ్యాయి. ఎనిమిది భవనాలు పూర్తి కాలేదు. వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు 14 మంజూరు కాగా ఒక భవనానికి అంచనా వ్యయం రూ.17 లక్షలు ఐదు భవనాలు పూర్తయ్యాయి. తొమ్మిది భవనాల పనులు ఇంకా చేపట్లేదు. మండల పరిధిలో ప్రభుత్వ భవనాలు పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని జిల్లా స్థాయి అధికారులు పదేపదే సమావేశాల్లో చెప్తున్నారు. కానీ మండలంలో మాత్రం పనులు నత్త నడకన సాగుతున్నాయి. అయితే నిర్మాణాలను సగానికి పైగా చేసినా గాని బిల్లులు సక్రమంగా రాకపోవడంతో కాంట్రాక్టర్లు భవన నిర్మాణ పనులు చేపట్టడంలో వెనకడుగు వేస్తున్నారు. అలాగే మండల పరిధిలో నిర్మాణాలు ప్రారంభం గానీ మిగిలిన భవనాలకు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావడం లేదు. దీంతో మండలంలో ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణ పనులు నత్తనడుగున సాగుతున్నాయి. కొన్ని గ్రామపంచాయతీలు అయితే గ్రామ సచివాలయ భవనాలు ఆర్‌బికే సెంటర్లు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్లు పనులు ప్రారంభించలేదు. మండల పరిధిలో బల్క్ మిల్క్ సెంటర్లు 18 మంజూరయ్యాయి. వీటి అంచనా వ్యయం ఒకటికి రూ.17.64 లక్షలు అలాగే డిజిటల్ లైబ్రరీకి 26 మంజూరు కాగా భవన నిర్మాణానికి అంచనా వ్యయం ఒకటికి రూ.16 లక్షలు. అయితే ఈ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు గుతేదారులు ఎవరు ముందుకు రాకపోవడంతో పనులు పూర్తిగా ప్రారంభం కాలేదు. ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో అందితే భవన నిర్మాణ పనులు వేగవంతం చేపడతామని ఇటు కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుత్తేదారులు వాపోతున్నారు.

నత్తనడకన సాగుతున్న కొట్టాలం గ్రామపంచాయతీ సచివాలయం నిర్మాణ పనులు

సకాలంలో బిల్లులు చెల్లిస్తే పనులు చేపడతాం

ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తే నిర్మాణ పనులు సకాలంలో చేపట్టేందుకు వీలుంటుంది. పనులు చేసి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో సచివాలయ భవన పనులు ఆపేసాం. చేసిన పనులకు బిల్లులు మంజూరైతే వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. **- వరదరాజుల నాయుడు**

అసంపూర్తి భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం

మండల పరిధిలోని అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేసేందుకు ఆ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ బిల్లులు కూడా ప్రభుత్వం నుండి మంజూరైన వెంటనే వారి ఖాతాలకు జమవుతుందని తెలిపారు. **- శివరాజ్, మండల అభివృద్ధి అధికారి, యాదమరి**

రచయిత్రి అరుణకు కందుకూరి నవలా పురస్కారం

కందుకూరి నవలా పురస్కారం అందుకుంటున్న రచయిత్రి అరుణకుమారి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కవిత, విద్యా సాంస్కృతిక సేవా సంస్థ కడప వారు 2010లో స్థాపించి విద్యా, సాంస్కృతిక, సేవా, సాహిత్య రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ఉత్తమ జాతీయ పురస్కారాలు అందించడం జరుగుతుంది. అందులో భాగంగా 2022వ సంవత్సరానికి గాను ఐదుగురు మహిళలకు వివిధ విభాగాలలో పురస్కారం ప్రదానం చేశారు. చిత్తూరుకు చెందిన ప్రముఖ స్త్రీవాద రచయిత్రి యంఆర్ అరుణ కుమారి రాసిన 'కన్నీటి చేవ్రాలు' నవలకు కందుకూరి నవలా పురస్కారం లభించింది. ఈ నవలా పురస్కారాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని గాంధీ రోడ్డులోని ఎన్జీవో హోంలో పురస్కార సభ జరిగినది. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మా ముఖ్యఅతిథిగా హాజరై సంస్థ చేస్తున్న విశిష్ట సేవలను అభినందించారు. మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తున్నారని, వర్తమాన సమాజంలో మహిళలను మరింత చైతన్యపరిచే విధంగా రచనలు చేయాలని తెలిపారు. కందుకూరి నవలా జాతీయపురస్కారం పొందిన కవయిత్రి యం ఆర్ అరుణ కుమారిని సన్మాన పత్రం దృశ్యాలువా, మాల, మెమెంటో తో పాటు 5000(ఐదు వేలు)నగదు బహుమతితో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ మరియు సంస్థ నిర్వాహకులచే ఘనంగా సత్కరించారు.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏకే వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. "రాష్ట్ర " పొలిటికల్ కన్సల్టెన్సీ వారు రాజకీయ విశ్లేషకుల కోసం ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసి నిరుద్యోగ యువతీ యువకులు ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొనవచ్చని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 7, 8 వ తేదీల్లో వర్సిటీలోని ప్లేస్మెంట్ సెల్ నూతన పరిపాలన భవనం లో ఉదయం 10:30 గంటలకు తమ బయోడేటాలు, ఫోటోలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు ద్రావిడ విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం సి కేశవమూర్తి సెల్ నెంబర్: 9440505878 కు సంప్రదించవచ్చని సూచించారు.

అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయించాలి

కమిషనర్ డాక్టర్ జె అరుణ

పలు పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలో 18 సంవత్సరాలు పూర్తయిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని నగర కమిషనర్, సహాయ ఓటర్ నమోదు అధికారి డా.జె అరుణ పోలింగ్ బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓ) ఆదేశించారు. కమిషనర్ ఆదివారం షర్మాన్ బాలికల పాఠశాలలోని 49వ పోలింగ్ కేంద్రాన్న, పీసీఆర్ జూ.కళాశాలలోని 65,66,67,68 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్, జిల్లా ఓటర్ నమోదు అధికారి ఆదేశాల మేరకు... చిత్తూరు నియోజకవర్గం నగరపాలక సంస్థ పరిధిలోని 146 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. బిఎల్వోలు ఆదివారం పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండడంతో పాటు.. 18 సంవత్సరాలు పూర్తి చేసిన వారు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 అందుబాటులో ఉంచాలని, ఎంతమంది ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారో వివరాలు పంపాల న్నారు. ఇదే సమయంలో ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానాన్ని చేపట్టాలన్నారు. ఓటర్ జాబితాలో సవరణలకు దరఖాస్తు పరిశీలన పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు-2023 కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ పరిధిలో పర్యవేక్షించడానికి 15 మంది అధికారులను సూపర్‌వైజర్లుగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ అధికారులు శనివారం వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు అందిన ఫాం-6 దరఖాస్తులను, ఆధార్ అనుసంధానాన్ని పర్యవేక్షించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : యాదమరి మండల పరిధిలోని మోర్ధానపల్లి వద్ద ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ఘనంగా ముగిసాయి. ఈ నెల 2, 3, 4 తేదీలలో మొత్తం అన్ని జిల్లాల నుండి 30 పాఠశాలల విద్యార్థి జట్లు పాల్గొనగా, అందులో నాలుగవ తేదీ చివరి రోజున పీఈఎస్, అనంతపురం, పేరూరు, వశిష్ట, ఆర్కే మోడల్ పాఠశాల జట్టులు ఫైనల్ కు చేరుకున్నాయి. ఫైనల్లో బాల బాలికల విభాగంలో అనంతపురం జట్టు విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా, పి ఈ ఎస్ పబ్లిక్ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ పేరూరు జట్టు విద్యార్థులు రన్నర్లుగా నిలిచారు. బాల బాలికల విభాగంలో ఆర్కే మోడల్ పాఠశాల, వశిష్ట జట్టులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పీఈఎస్ విద్యాసంస్థల అధినేత ఎమ్ దొరస్వామి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, గౌరవ అతిథి టి. చెంగలరాయనాయుడు గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం.కుమారస్వామి నాయుడు, పీఈఎస్ విద్యాసంస్థల పరిపాలన అధికారి దామోదర నాయుడు, పిఈఎస్ వైద్య రంగ అధికారి రాజా, పీఈఎస్ పిఇటి సురేష్, రెఫరీలు, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

బీసీల అభివృద్ధికి జగనన్న చేదోడు

బీసీ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న చేదోడు పథకాన్ని అమలు చేస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఎడి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పథకం కింద తోపుడు బండ్లు, వీధి వ్యాపారులకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా జగనన్న చేదోడు పథకం జిల్లాలో అమలు చేస్తున్న తీరుపై ప్రజాశక్తి తో మాట్లాడుతూ...

ప్రజాశక్తి: జగనన్న చేదోడు పథకం పొందేందుకు అర్హతలు ఏమిటి...?

ఏడీ: ఈ పథకం పూర్తిగా బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా ముందుకు తీసుకుపోయేందుకు తీసుకొచ్చిన పథకం. దీని ద్వారా పొందే ఆర్థిక సాయం ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఆర్థికంగా ఎదగాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

ప్రజాశక్తి: జగనన్న చేదోడు పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు ఎంతమందికి ఆర్థిక సాయం అందింది....?

ఏడీ: ఈ పథకం ద్వారా జిల్లాలోని 39.602 మందికి రూ. 39.60 కోట్ల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది.

ప్రజాశక్తి: జగనన్న చేదోడు పథకం ద్వారా ఆర్థిక సాయం అర్హతలు ఏమిటి....?

ఏడీ: గ్రామాలు, పట్టణాల్లో శాశ్వత లేక తాత్కాలిక చిన్న షాపులు ఏర్పాటు చేసుకున్న వారికి ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో తోపుడు బండ్ల మీద వస్తువులు, కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు అమ్ముకుంటు జీవించే వారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, గంపలు, బుట్టలలో కూరగాయలు, ఆట వస్తువులు అమ్మే కొనే వారు, సైకిల్, మోటర్ సైకిళ్ళు, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునే వారు అర్హులు.

ప్రజాశక్తి: జగనన్న చేదోడు పథకం ద్వారా ఆర్థిక సాయం ఎంత అందుతుంది...?

ఏడీ: జగనన్న చేదోడు పథకానికి ఎంపిక చేసిన అర్హులకు ఏడాదికి రూ.10000 చొప్పున ఐదు సంవత్సరాల్లో రూ.50 వేలను ప్రభుత్వం ఉచితంగా అందించడం జరుగుతోంది. చిరు వ్యాపారస్తులు అధిక వడ్డీలకు అప్పులు చేయకుండా ఆదుకునేందుకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది.

ప్రజాశక్తి: జగనన్న చేదోడు పథకాన్ని పొందేందుకు నిబంధనలు ఏవైనా ఉన్నాయా....?

ఏడీ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇబిసి సామాజిక వర్గాలకు చెందిన టైలరింగ్, నాయి బ్రాహ్మణ, రజక, సామాజిక కులవృత్తుల, సొంతంగా చిన్న చిన్న షాపులున్న వారు 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సుగల వారికి సంవత్సరానికి ఒక్కొకరికి రూ.10 వేలు చొప్పున 5 సంవత్సరాలకు రూ.50 ఇవ్వడం జరిగింది. జిల్లాలో 39,602 మందికి రూ.39.60 కోట్లు వారి బ్యాంక్ ఖాతాలకు జమచేయడం జరుగుతుంది.

ప్రజాశక్తి: బీసీ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలు ఎంతమందికి ఇచ్చారు.....?

ఏడీ: జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1,33,317 మందికి రూ.202.43 కోట్లు వడ్డీ లేని రుణాలను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేయడం జరుగుతుంది.

కొయ్య 'బొమ్మ'కు బాలాజీ 'ప్రాణం'

దేవతలు, వాహన తయారీలో అందెవేసిన చేయి

'విగ్రహాలకు' అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు

ప్రజాశక్తి - వి.కోట

శిల్పం ప్రాణం పోసుకుందంటే ఆ శిల్పికి అంతకంటే ఆనందం ఏముంది..? ఆ శిల్పానికి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు వచ్చిందంటే ఎంతో సంతోషం... పాలకులు, ఉన్నతాధికారుల చేతుల్లో సత్కారానికి గుర్తింపుగా తను చెక్కిన శిల్పం జ్ఞాపికగా అందించినపుడు ఆ ఆనందం అవధులు దాటుతుంది.. ఇక దేవాలయాల్లో పూజలందుకుంటుంటే ఆ శిల్పి జన్మ ధన్యం.. రాష్ట్రానికి విచ్చేసే ప్రముఖులకు జ్ఞాపికలుగా జీవం పోసి భారతదేశ శిల్పకళకు ప్రాణం పోస్తున్న శిల్పి వి.కోటకు చెందిన బాలాజీ.

వి.కోట మండలం మద్దిమాకులపల్లికిచెందిన బాలాజీ (48) శిల్పి. తిరుపతిలోని టిటిడిలో పనిచేసే ప్రముఖ దారు శిల్ప కళా నిపుణుడు గోవిందరాజు స్థపతి వద్ద శిష్యునిగా చేరి విద్యను అభ్యసించాడు. అతని చేతుల్లో తయారైన తిరుమల వెంకన్న శిల్పాలకు జీవం ఉట్టిపడి వాటికి నేడు దేశ విదేశాల్లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది.

వేపచెక్క, రోజ్‌వుడ్, టేకు కొయ్యలతో పాటు ఇతర నాణ్యమైన చెక్కలను విగ్రహాల తయారికీ ఉపయోగిస్తారు. అతుకులు లేకుండా ఏక చెక్కతో చేతి పనిముట్లతోనే అందమైన శిల్పాలను తయారు చేయడం వీరి ప్రత్యేకత. ఎంపిక చేసిన చెక్కపై ఒక అడుగు నుంచి 13 అడుగుల వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ మహాలక్ష్మి, సరస్వతి, వినాయకుడు తదితర దేవతామూర్తుల విగ్రహాలతో పాటు దేవాలయాలకు అవసరమైన ఇతర వస్తువులను చేతి పనిముట్లతోనే తయారు చేసే కళను దారు శిల్పకళ అంటారు. ఈ కళలో శిల్పం తయారీలో ఎటువంటి లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

లేపాక్షి హస్తకళ సంస్థ ప్రోత్సాహం

బాలాజీ తయారు చేసే దారు శిల్పాలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని లేపాక్షి హస్తకళ సంస్థ కొనుగోలు చేస్తుంది. 2002లో తయారు చేసిన మదన గోపాలుడు శిల్పానికి లేపాక్షి అవార్డును అందజేశారు. దేశంలోని ప్రముఖ దేవాలయాల్లోనూ, ఉత్సవాల్లోనూ ఉపయోగించే బ్రహ్మోత్సవ వాహనాలనూ బాలాజీ బృందం తయారు చేస్తుంది. తిరుపతిలోని కపిలతీర్థం దేవాలయంలో బ్రహ్మోత్సవాలకు వినియోగించే సూర్య చంద్రప్రభ శేష కల్పతరువు వాహనాలతో పాటు 12 వాహనాలను బాలాజీ తయారు చేశారు. వీటితో పాటు తాడిపత్రిలోని చింతల వెంకటరమణ స్వామి రథన్ని సోదరుడు సి.సుబ్రమణ్య ఆచారి సహకారంతో తయారు చేశారు. తిరుపతిలోని ఇస్కాన్ దేవాలయంలో ఉపయోగించే ఊయల బాలాజీ చేతుల్లో తయారయ్యిందే. తిరుపతి, హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రదర్శనలో బాలాజీ పలు అవార్డులను అందుకున్నారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో సైతం తమ శిల్ప ప్రతిభకు సన్మానాలు అందుకున్నారు. తాను నేర్చుకున్న విద్యను పలువురికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో దాదాపు 25 మంది కళాకారులకు ఈ విద్యను నేర్పి వారికి ఉపాధి కల్పిస్తున్నారు.

వీరు తయారు చేసిన అధిక శిల్పాలను లేపాక్షి వారే కొనుగోలు చేస్తున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గతంలో రాష్ట్రానికి విచ్చేసినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా, దేశ ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్, రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ తో పాటు పలువురు ప్రముఖులకు ఈయన తయారు చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాలనే జ్ఞాపికగా అందజేశారు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో అవార్డులు లభించాయని ఎప్పటికైనా జాతీయస్థాయి హస్తకళల పోటీల్లో అవార్డులు పొందడంతోపాటు తనకు 65 సంవత్సరాలు నిండిన తర్వాత పంచలోహ శివాలయాన్ని నిర్మించాలన్నదే తన లక్ష్యమని వారు తెలిపారు.

విద్యార్థులకు వ్యర్థాలపై అవగాహన అవసరం : డైరెక్టర్ ఘోష్

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు తమ చుట్టూ ఉన్న పరిసరాలలోని వృధా వ్యర్థ పదార్థాలపై కనీస అవగాహన కలిగి వ్యర్థాలను తిరిగి వినియోగించే విధంగా వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని 12వ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ వేస్ట్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ఘోష్ పిలుపునిచ్చారు. ఏపీ కాస్ట్ ఎస్వి యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో 12వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్కులర్ ఎకానమీ అండ్ ఐపీఎల్ ఏ ఫామ్ 2022 " లో భాగంగా పాఠశాల విద్యార్థుల కోసం స్వచ్ఛత అండ్ సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రధానంశంగా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ, సెనేట్ హాల్‌లో కాంపిటీషన్స్ నిర్వహించారు. ఈ పోటీలలో తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి ఇన్‌స్పైర్ సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ లో జాతీయస్థాయిలో గెలుపొందిన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కుల సజీవులు



ఆచార్య ఓఎండి హుస్సేన్, ప్రొఫెసర్ వరదరాజులు, 12వ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ వేస్ట్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ఘోష్, జిల్లా ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కేడీ సారధి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేసినట్లు కార్య నిర్వాహకులు ఎస్వీయూ ప్రొఫెసర్ వరదరాజులు తెలియజేశారు. రీసెర్చ్ డిన్ ఆచార్య ఎస్ విజయ భాస్కర రావు, ఇంజనీరింగ్ అధ్యాపకులు, డాక్టర్ హేమ, అకాడమీ కన్సల్టెంట్లు డాక్టర్ బాలు, పరిశోధకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవానికి భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం హైస్కూల్ క్రీడా మైదానంలో ఎంపీపీ బండి నాగహేమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ ప్రతాప్ స్వామీజీ నేతత్వంలో ఈనెల ఆరో తేదీన కార్తీక మాస కత్తిక నక్షత్రంలో లక్ష దీపోత్సవం కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు మూడు రోజులుగా లక్ష దీపోత్సవ కార్యక్రమానికి ముమ్మరంగా పనులు చేస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, జిల్లా జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, టీటీడీ బోర్డు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఏకాంబరం, నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల వైసీపీ నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆస్పత్రుల్లో పింఛను పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ టీఎం గొల్లపల్లికి చెందిన వాలంటీరు భారతి మదనపల్లెలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మునిరామయ్యకు తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛను అందించారు. పేటూరు పంచాయతీకి చెందిన శివమ్మ అనే వద్ధురాలు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతుండగా వాలంటీరు సుబ్రహ్మణ్యం వెళ్లి వద్ధురాలికి పింఛన్ పంపిణీ చేశాడు. వీరిని పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సోమల: ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని..గృహనిర్మాణాలను చేయాలని ఎంపీడీవో నాగరాజు కోరారు. పెద్ద ఉప్పరపల్లి సమీపంలోని లేఅవుట్‌లో ఆయన ఆదివారం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గహనిర్మాణ బిల్లులను త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా కిషన్‌చంద్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లి పంచాయతీ తెట్టిగుండ్లపల్లె గ్రామానికి చెందిన గురసాల కిషన్‌చంద్ టీడీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సోషల్ మీడిగా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కషి చేస్తూ నియోజకవర్గంలో పార్టీ అభివద్ధికి తనవంతు కషి చేస్తానన్నారు. కామసాని లోకనాథ్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్ ,జీడి నెల్లూరు వాణిజ్య విభాగా అధ్యక్షులు బట్టే చాణిఖ్య ప్రతాప్ ,చిత్తూరు జిల్లా పార్లమెంటు వాణిజ్య విభాగ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, జయచంద్ర పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ భవాని తనిఖీ చేశారు. ఆదివారం గంగాధనెల్లూరు మండలం నెల్లేపల్లె , వేల్కూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కొత్త ఓటర్ల నమోదుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాథన్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వో జయకుమార్, పలువురు బీఎల్వోలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం విగ్రహ ప్రతిష్టకు సహకరించాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహ ప్రతిష్టకు సహకరించాలని ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, మాజీ సర్పంచ్ కష్ణమూర్తిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో విగ్రహ ప్రతిష్టకు స్థలం కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో ముత్తువల్లి నూర్ అహ్మద్, మసీదు కార్యదర్శి మున్నా, ఎర్రపల్లి ఉమర్ ముస్లిం జేఏసీ ఉపాధ్యక్షులు లాలు, కోశాధికారి సయ్యద్ షంషీర్, జేఏసీ సభ్యులు షేక్ జిలానీ బాషా హీద్దు, సూహెల్ అహ్మద్, ఉమర్, దావూద్, హయత్, సమీర్, రియాజ్ సేటు, అజ్జు, ఫిరోజ్, బలిజపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సోమల: సదుం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు గదిలో మధ్యాహ్నం రెండు గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సదుంలో రైతుభేరి భగ్నం..!

ప్రజాశక్తి-పుంగనూరు: సదుం మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన రైతుభేరి ధర్మ యుద్ధ సభను జరగనివ్వకుండా పోలీసులు రామచంద్రయాదవ్ ఇంటి వద్దనే అడ్డుకున్నారు. పుంగనూరు కొత్తఇండ్లులో ఉన్న రామచంద్రయాదవ్ వీధిలో ఆదివారం ఉదయం నుంచి భారీగా పోలీసులు మోహరించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో రామచంద్ర యాదవ్ రైతుభేరి సభకు బయలుదేరడానికి సిద్ధం కాగా.. పోలీసులు అతని వాహనాన్ని అడ్డుకున్నారు. రామచంద్ర యాదవ్ తరఫున హైకోర్టు న్యాయవాది తమకు సభ నిర్వహణకు అనుమతులు ఉన్నాయని..అడ్డుకోవడం సబబు కాదని.. వాదనకు దిగినా పోలీసులు ససేమిరా అంటూ వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఉదయమే పోలీసులు ఆయన అనుచరులను అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు పోలీసులు వెళ్లారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో రాజకీయంగా తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు ఇక జరగనివ్వమన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో రైతుభేరి సభను నిర్వహించి తీరుతామని తెలిపారు. ఆయన వెంట వచ్చిన కార్యకర్తలు నినాదాలు చేయడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, వంద మంది కానిస్టేబుళ్లలో రామచంద్ర యాదవ్ ఇంటి వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పహారా కాశారు.

'పెద్దిరెడ్డి' అనుచరుల 'వీరంగం'

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై రామచంద్ర యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పుంగనూరులో అభిమానులు విధ్వంసం సష్టించారు. పట్టణంలోని కొత్త ఇండ్లు లోని ప్రముఖ పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్ ఇంటిపై వైఎస్ఆర్ సిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఈ దాడుల్లో ఏడు ఫోర్ వీలర్ ల్యాండ్ క్రూజర్, ఫార్చునర్, ఇన్నోవా వాహనాలను ధ్వంసం చేశారు. ఆరు ద్విచక్ర వాహనాలను పూర్తిగా పగలగొట్టారు. ఇంటి అద్దాలు ప్రధాన గేటును పూర్తిగా ధ్వంసం చేశారు. సదుం మండల కేంద్రంలో రైతుభేరి సభ సంబంధించి మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వీరంగానికి పాల్పడటం గమనార్హం.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రతి పంచాయతీ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లతాబాలాజీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సీడీ కండ్రిగ పంచాయతీలో పలు అభివద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలు లేని పంచాయతీల ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవ చూపుతున్నారని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు ఇప్పటికే 98 శాతం పూర్తయ్యాయని.. మిగిలిన రెండు శాతం త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సుమారు రూ.6 లక్షల నిధులతో సీడీ కండిగ పంచాయతీకి డంపింగ్ యార్డు, శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగమ్మ, ఎంపిటిసి నందిని, ధనరాజ్, ఆకులు గోపి, కుప్పారెడ్డి, రాజారాం వైసీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి-కార్వేటినగరం : ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణతో మెలగాలని.. అప్పుడే విద్యార్థి అనుకున్న లక్ష్యాన్ని అందుకుంటారని మండల తహసీల్దారు అమర్నాథ్ అన్నారు. ఆదివారం కార్వేటినగరంలోని లక్ష్మీ నరసింహ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో.. ఉన్నత ఆశయంతో ముందుకెళ్లాలన్నారు. గుర్రప్ప మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ధనంజయ రెడ్డి, దిలీప్, వెంకటేష్, పురుషోత్తం, ప్రిన్సిపల్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న లోకేష్ ఏటీఎం వద్ద దొరికిన సొమ్మును ఆధివారం పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ మండల కేంద్రంలోని మండపం వీధిలో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో బజారు వీధికి చెందిన ఉదయకుమార్ తన ఖాతా నుంచి ఏటీఎంలో రూ.15 వేలు డ్రా చేశారు. అయితే తనకు అత్యసరమైన ఫోన్ కాల్ రావడంతో నగదును ఏటీఎంపై పెట్టి ఫోన్లో మాట్లాడుతూ వెళ్లిపోయారు. అనంతరం నగదు డ్రా చేయడం కోసం వెళ్లిన పంచాయతీ కార్యదర్శి లోకేష్ ఏటీఎంపై ఉన్న నగదును చూసి వెంటనే పోలీస్టేషన్‌లో అప్పగించారు. ఏఎస్సై స్పందించి ఏటీఎం వద్ద ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి నగదును వదిలి వెళ్లిన ఉదయ్‌కుమార్‌కు అప్పగించారు. నగదును అప్పగించిన లోకేషను పోలీసులు అభినందించారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

ప్రజాశక్తి-సోమల: రానున్న 2023-24 ఆర్థిక సంవత్సరానికి లేబర్ బడ్జెట్ తయారీ, పనుల గుర్తింపు కోసం ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు మండలంలోని 16 పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు సదుం ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. 5న గొంగివారిపల్లి, 6న అమ్మగారిపల్లి, రెడ్డివారిపల్లి, 7న కంభంవారిపల్లి, పాలమంద, 8న తాటిగుంటపాలెం, సదుం, 9న బూరగమంద, ఎర్రాతివారిపల్లి, 12న చింతలవారిపల్లి, ఊటుపల్లి, చింతమాకులపల్లి, 13వ తేదీ నడిగడ్డ, జోగివారిపల్లి, 14న తిమ్మానాయనపల్లి, చెరుకువారిపల్లి పంచాయతీలలో ఉదయం 10 గంటలకు గ్రామ సభలు ప్రారంభమవుతాయని ఏపీవో శివకుమార్ పేర్కొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-సోమల: సదుం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు మామిడి రైతులకు ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించనున్నటుల ఉద్యానఅధికారిణి సంతోషి కుమారి తెలిపారు. మామిడిలో పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ మహాసభ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పులిచెర్ల: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో డిసెంబర్ 7న తలపెట్టిన జయహో బీసీ గర్జన విజయవంతం కోసం పులిచెర్ల మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు బీసీల సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పాల ఏకరి కార్పోరేషన్ ఛైర్మన్ మురళీధర్ తెలిపారు. పులిచెర్ల మండలం పాలెంలోని ఆయన నివాసంలో మురళీధర్ మాట్లాడుతూ జయహో బీసీ గర్జన మహసభ విజయవంతం కోసం నిర్వహిస్తున్న సమావేశానికి మండలంలోని బీసీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీసీ కులాల నాయకులు హాజరుకావాలన్నారు. సమావేశానికి బీసీ సోదరులు తప్పక హాజరుకావాలని మురళీధర్ కోరారు.

ప్రకృతి ఆహార పదార్థాలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రకృతి ఆహార పదార్థాలు తీసుకోవాలని ప్రకృతి ఆహార పదార్థాల విక్రయ యజమాని తులసిరామ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాజా వీధిలో ప్రకతి ఆహార పదార్థాల విక్రయ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రకతిని ప్రేమించాలని.. ప్రకతి ప్రసాదించే ఆహారాన్ని తీసుకోవాలని.. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయాన్ని సాగు చేయడంతో ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

ఘనంగా పడిమెట్ల పూజ

ప్రజాశక్తి-సోమల: అయ్యప్పమాల ధరించిన భక్తులు అయ్యప్ప పడిమెట్ల పూజను ఘనంగా నిర్వహించారు. ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలోని శివాలయంలో శనివారం రాత్రి వినాయకస్వామి, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వామి పటాలను అరటి పట్టలతో నిర్మించిన పడిమెట్ల వద్ద ప్రతిష్టించి పుష్పాలంకరణ చేసి పూజలు చేపట్టారు. దాదాపు 200 మందికి పైగా అయ్యప్ప మాలధరించిన భక్తులు కార్యక్రమానికి విచ్చేసి భజనలు, పాటలు పాడి స్వామివారికి మంగళ హారతులను అందజేశారు.

క్రైం న్యూస్

సిద్ధేశ్వరకొండ ఆలయ ధర్మకర్త మునిరత్నంరెడ్డి మృతి

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: మండలంలోని సిద్దేశ్వరకొండ ఆలయ ధర్మకర్త మునిరత్నంరెడ్డి అనారోగ్యంతో శనివారం బెంగళూరులో మరణించారు. ఈయన గత కొంత కాలంగా వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండలోని శ్రీ ప్రసన్న పార్వతీ సిద్దేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా కొనసాగుతున్నారు. ఆయన భౌతిక కాయాన్ని వేట్కూరుపల్లెకి తీసుకొచ్చారు. మునిరత్నంరెడ్డి భౌతికయానికి రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్‌నాయుడు, వింజం సర్పంచ్ రామక్క గోవింద్, బాలగంగాపల్లి మాజీ సర్పంచ్ దేవరాజులు, ఎంపీటీసీ భూలోకరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, తులసిరెడ్డితో కలిసి బంధువులు, పలువురు నేతలు నివాళులు అర్పించారు.

విద్యార్థి మృతికి సంతాపం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: పచ్చికాపల్లంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి భానుప్రకాష్ ఆదివారం ఆకస్మికంగా మృతిచెందాడు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్నా యుగంధర్ చేరుకుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అక్రమ మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలోని పాలేరు ఫ్లైఓవర్ వద్ద వెదురుకుప్ప మండలం ఆళ్లమడుగు గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి కుమారుడు పాండురెడ్డి అనుమానస్పద స్థితిలో తిరుగుతుండగా అతడిని అదుపులో తీసుకొని పరిశీలించారు. అతని వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం ఉండటంతో అక్రమ మద్యం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గజేంద్ర, కానిస్టేబుల్ బెనర్జీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందించాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు డిమాండు చేశారు. ప్రభుత్వం జగనన్న కాలనీ నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలు చాలడం లేదని లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న నగదు పునాదులు వేసేందుకు కూలీలకే సరిపోతోందన్నారు. ఇల్లు కట్టుకోవడానికి కావాల్సిన సిమెంటు, ఇసుక, కమ్మీలు, ఇటుకలు కొనలేకపోతున్నామని ఆవేదన చెందారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తే ఇబ్బంది లేకుండా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని గహప్రవేశం చేసుకుంటారని తెలిపారు. ఈ విషయమై సోమవారం 5వ తేదీన తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపనున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి రామ్ కోదండయ్య, దాసరి సంద్ర, రఘు, గజేంద్రబాబు, కష్ణయ్య, మురళీ, చిన్న పాప, రమేష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-పులిచెర్ల: పులిచెర్ల మండలంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. కల్లూరు పట్టణానికి ఉత్తరం వైపున పీలేరు రోడ్డుకు సమీపంలో మామిడితోటకు వెనుక వైపు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ:6,320 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో పోలీసు సిబ్బంది రషీద్, మురళీ, ఢిల్లీ ప్రసాద్, ముబారక్ పాల్గొన్నారు.

కులం పేరుతో అధికారుల దూషణ

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని ఘంటాజపల్లి పంచాయతీ నాలుగురోడ్ల కూడలిలో రూ.కోట్ల విలువైన ప్రాంతం అన్యాక్రాంతం అయినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు ఓ దళితుడు ఎన్నో ఏళ్లగా తన ఆధీనంలో ఉన్న భూమిలో ఇంటి నిర్మాణానికి పునాది వేసుకుంటే కులం పేరుతో దుర్భాషలాడి అధికారులు హల్‌చల్ చేశారు. గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలిలో పెద్దల కాలం నుంచి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి తాను అనుభవిస్తున్న స్థలంలో పునాది వేసుకున్నాడు. అయితే ఆదివారం స్థానిక రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించడానికి ప్రయత్నించగా సుబ్రహ్మణ్యం ప్రాధేయపడ్డాడు. అయినా అధికారులు కులం పేరుతో దూషిస్తూ పునాదులను తొలగించారని వాపోయాడు. ఇదే ప్రాంతంలో 317/2 సర్వే నెంబరులో రూ.కోట్లు విలువైన భూమి ఆక్రమించినా పట్టించుకోని అధికారులు నిరుపేదనైన తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఇల్లు కట్టుకోకుండా అడ్డుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని తెలిపారు.

శ్రీవారి సేవలో ఉప ముఖ్యమంత్రి



ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి దర్శించు కున్నారు.. ఆదివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆలయం వెలుపల కొందరు మీడియా ప్రతినిధులు అమర రాజా బ్యాటరీస్ కంపెనీ ఈ రాష్ట్రం నుంచి తరలిపోతుందని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిని ప్రశ్నించారు. దీనికి అమర రాజా కంపెనీ తరలింపు విషయం చెప్ప కుండా ఉప ముఖ్యమంత్రి పొంతన లేని సమాధానాలు చెప్పుతూ తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై ధ్వజ మెత్తారు. ఈ రాష్ట్రం నుంచి ఏ కంపెనీలు తరలిపోలేదని చెప్పారు..

టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు

- మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండలం కీలపట్ల పంచాయతీలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మాజీ మంత్రి అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'ఇదేమి ఖర్మ.. మన రాష్ట్రాలకి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట కీలపట్ల కోనేటిరాయుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అవినీతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెట్రోల్.. డీజల్.. గ్యాస్ ధరలు పెంచారని, ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డి పాలనపై విరక్తి పుట్టి సొంత పార్టీలోనే నాయకులు.. కార్యకర్తలలో విభేదాలు ఏర్పడుతున్నాయని.. ఇప్పటికే సర్పంచులు ఖర్చు పెట్టిన బిల్లులు రాకపోవడంతో వడ్డీలు కట్టుకోలేక ఆస్తులమ్మాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని.. రానున్న ఎన్నికల్లో టీడీపీ ని అందరూ ఆశీర్వదించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకపాలనను గ్రామాల్లో ప్రజలకు వివరించి చైతన్యవంతులుగా చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీ, కావలిమడుగు గ్రామంలో 'ఇదేమి ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంటలప్ప గౌడు, పత్రా నారాయణ, రామకష్ణప్ప, శ్రీనివాసులు గౌడు, కామరాజ్ నాయక్, మనోహర్, తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్, వెంకటాచలం, పి.టి అప్పాల, మురళీ, సురేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, గిరిదాస్, వెంకటరమణ, భాస్కర్, ఆదిల్‌బాషా, మంజు, శ్రీనాథ్ రెడ్డి, పరుశురాం, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

జస్టిస్ రంగనాథ్ కమిషన్ చట్టానికి సహకరించరూ..!

ప్రజాశక్తి-పుంగనూరు: జస్టిస్ రంగనాథ్ మిశ్రా, జస్టిస్ రాజేంద్ర సచ్చార్ కమిషన్ నివేదిక చట్టం కోసం సహకరించాలని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామికి మైనారిటీ నాయకుడు అయూబ్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జనతా దళ్ నాయకులు కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుంగనూరుకు చెందిన మైనారిటీ నాయకుడు ఆర్‌కే అయూబ్‌ఖాన్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం ముస్లిం సామాజికవర్గ అభివద్ధి కోసం విద్య , ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో జనాభా పద్ధతిలో కేటాయింపులకు జస్టిస్ రంగనాథ్ మిశ్రా, జస్టిస్ రాజేంద్ర సచ్చార్ కమిషన్ నివేదికను చట్టం కోసం సహకరించాలని కోరారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి హామీ ఇస్తూ ఖచ్చితంగా ముస్లిం మైనారిటీల కోసం పార్లమెంట్‌లో, కర్ణాటక అసెంబ్లీ లో తమవంతు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు రక్త దాతలకు సేవా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ హరిప్రసాద్, లెజండ్ రక్త దాతల రాష్ట్ర అధ్యక్షుడు పి.రంజాన్, రియాజుల్లా ఖాన్, ముల్లా ఉమర్‌ఖాన్, ఎం ఎస్ రఘునాథ్, ఎంపీటీసీ సురేష్, డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, మల్లికార్జున, అతీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-యాదమరి: ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తులు ఈనెల 9వ తేదీ వరకు చేసుకోవచ్చని యాదమరి మండల తహసీల్దారు చిట్టి బాబు ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న జాబితాలో తిరస్కరణ అయిన వారు, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : 8-119, రాయల్ నగర్, ఆర్.సి. రోడ్డు, తిరుపతి.
- ఆర్.కె. కాంప్లెక్స్, సి.వి.ఆర్.ఎం. డిగ్రీ కాలేజి ఎదురు, లాంగ్‌బజార్, వెంకటగిరికోట.
- ఫస్ట్‌ఫ్లోర్, డిఆర్‌సి కాంప్లెక్స్,ఆర్ఆర్ స్ట్రీట్, మదనపల్లి.
- ఫస్ట్‌ఫ్లోర్, బజార్‌స్ట్రీట్,న్యూపేట్, రామ్మూర్తి స్వీట్‌షాప్ ఎదురు, పలమనేరు.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 27.12.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 3465.15 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజ శ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

M.V.O.P No. 472/2021

C. ఎర్రమల. ...అర్జీదారు

-Vs-

B.అయూబ్ సాహెబ్ వగైరా. ...రెస్పాండెంట్లు

1వ రెస్పాండెంటుకు నోటీసులు

1.B. అయూబ్ సాహెబ్ తండ్రి తమన్ సాహెబ్ , డ్రైవరు, ఇంటి నెం. 3-145-13-7-7, ప్రశాంత్ నగర్, మదనపల్లి టౌన్ మరియు మండలం చిత్తూరు జిల్లా.

పై నంబరు M.V.O.P లో అర్జీదారు తనకు రోడ్డు ప్రమాదములో జరిగిన గాయములకు నష్టపరిహారము రూ. 2,00,000/- లు, ఇందుపైన ప్రమాదము జరిగిన రోజు నుండి 18% ప్రకారము వడ్డీ తో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతు పై కోర్టులో అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 1వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 13-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 13-12-2022

C.V. శ్రీనివాసులు,
అర్జీదారు పరం న్యాయవాది,
కర్నూలు.